ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 27-10.2025 సమయం : 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నేపథ్యంలో పత్తి, వరి, మొక్కజొన్న కొనుగోళ్ల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
2. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడం, రాష్ట్రం లో శాంతిభద్రతలు క్షీణించడం వారి పరిపాలనకు అద్దం పడుతోందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు.
3. విద్య, వైద్య, వ్యవసాయంతో సహా అన్ని రంగాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకారించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు.
4. మొంథా తుఫాను ప్రబావంతో రాష్ట్రంలోని పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి ములుగు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రేపు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

----------------------

## PROCUREMENT

తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పత్తి, వరి, మొక్కజొన్న కొనుగోళ్ల సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి నష్టం కలగకుండ కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు

సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నీటి పారుదల పౌరసఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్లు, సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంసిద్ధతను సమీక్షించి అవసరమైన చర్యలను తీసుకోవాలని అదికారులను కోరారు.

**PN**

---------------------

**BJP**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడం నుండి రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు క్షీణించడం వారి పరిపాలనా వైఫల్యానికి అద్దం పడుతుందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఈ రోజు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రైతులు "రోడ్లపైకి నెట్టబడుతున్నారు" అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వరి, మొక్కజొన్నలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడం ప్రారంభించాలని, అవసరమైన రవాణా సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులు దాదాపు రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉండడంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్ లో డీసీపీ పై జరిగిన దాడితో ప్రస్తుత ప్రభుత్వ శాంతిభద్రతల వైఫల్యాల తీరు అద్దం పడుతుందని ఆయన అన్నారు.

**PN**

-----------------------------------

**బండి సంజయ్**

విద్య, వైద్య, వ్యవసాయంతో సహా అన్ని రంగాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకారించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. పోషణ మాసోత్సవ ముగింపు వేడుకలు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని

కళభారతిలో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిధిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన ప్రకారం పోషకాహారం, అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో అనేక కార్యక్రమాలు నిర్వహించిన జిల్లాలో కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉంది అన్నారు.

**బైట్ బండి సంజయ్**

**పిటిసి, కరీంనగర్**

--------------------------

**సీతక్క**

ములుగు జిల్లా కేంద్రంలో మాధవరావుపల్లి గ్రామంలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయం తరగతి గదులు, ప్రయోగశాలలను కలెక్టర్ దివాకర్ టిఎస్ తో కలిసి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో బాలికలకు విద్య అవసరం లేదనే సనాతన ధర్మం పాటిస్తూ వంటగదిలకే పరిమితం చేశారని,నేడు మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని వివరించారు.

**బైట్ సీతక్క**

**పీటీసీ - ములుగు**

------------------------------

## PREZ – IPS

వికసిత్ భారత్ నిర్మాణంలో యువ అధికారులు ప్రదాన పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు 77వ ఐపీఎస్ ప్రొబెషనర్ల బ్యాచ్ ను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. అధికారంతో పాటు జవాబుదారీతనం ఉంటుందన్న విషయాన్ని యువ అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. యువ అధికారులు నైతిక మార్గాన్ని

ఎంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో కూడా న్యాయ విధానాలను అనుసరించాలని రాష్ట్రపతి చెప్పారు. యువ IPS అధికారుల AI వంటి కొత్త సాంకేతికతలను కూడా అనుసరించాలని కోరారు.

**NSD**

-----------------------

**SHAH – NAXAL**

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఈ రోజు 13 మంది సీనియర్ కేడర్లతో సహా 21 మంది మావోయిస్టులు లొంగిపోయారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొన్నారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించాలనే సంకల్పాన్ని తెలియజేస్తూ.. మిగిలిన మావోయిస్టులు కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలని కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేశారు

**NSD**

-----------------------

**SC – DOGBITES**

దేశంలో వీధి కుక్కల బెడద సమస్యపై సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అఫిడవిట్ దాఖలు చేయని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు నవంబర్ 3న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఉన్నత న్యాయస్థానం ఈ రోజు ఆదేశించింది. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్లు మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్వి అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ రాష్ట్రాలు మినహా, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు ఆ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని, సమ్మతి అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

**ANI**

---------------------------

**కడియం శ్రీహరి**

రైతులు నష్టపోకుండా వారు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటలను కొనుగోలు చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి తెలిపారు. ఈరోజు స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలోని సిరి కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.

**పీటీసీ, జనగామ**

----------------------

**CONFERENCE**

హైదరాబాద్‌లో ఈ నెల 29 నుంచి 3 రోజుల పాటు జరిగే కేంద్ర పాఠశాల విద్య బోర్డుల మండలి వార్షిక సమావేశాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభిస్తారు. ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్ అధ్యక్షుడు డాక్టర్ జి ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 70 కి పైగా పాఠశాల బోర్డుల నుండి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతారని అన్నారు. ఈ సమావేశంలో దేశంలో పాఠశాల విద్య భవిష్యత్తు - సవాళ్లు అవకాశాల పై చర్చించనున్నారని తెలిపారు.

**MSL**

-----------------------

**WEATHER**

పశ్చిమ మధ్య ఆగ్నేయ బంగాళాఖాతంలోని నైరుతి, వాయువ్య పరిసర ప్రాంతాలలో ఏర్పడిన మొంథా తుఫాను మరింత బలపడింది. ఈ తుఫాను ప్రబావంతో రాష్ట్రంలోని పెద్దపల్లి,

జయశంకర్ భూపాలపల్లి ములుగు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రేపు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ పేర్కొంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసాయని వాతావరణ శాఖ తెలిపింది.

**PN**

-----------------------------

**ISRO – LVM3**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లాలోని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని లాంచ్ ప్యాడ్‌కు LVM3 లాంచ్ వాహనాన్ని తరలించారు. లాంచ్ వెహికల్‌ను పూర్తిగా విడి భాగాలను జత చేసి నవంబర్ 2న ప్రయోగించనున్న CMS 03 కమ్యూనికేషన్ ఉపగ్రహంతో అనుసంధానించారు. మార్క్ 3 లాంచ్ వెహికల్ ఐదవ కార్యాచరణ విమానం 4400 కిలోల బరువున్న దేశం అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్ ఫర్ కక్ష్యలో ఉంచుతుంది. CMS-03 మల్టీ బ్యాండ్ ఉపగ్రహం భారత భూభాగం చుట్టూ ఉన్న విస్తృత సముద్ర ప్రాంతంలో కమ్యూనికేషన్ సేవలను మెరుగుపరుస్తూ, మారుమూల ప్రాంతాలకు డిజిటల్ యాక్సెస్‌ను విస్తరిస్తుంది.

**NSD**

-----------------------

**జాబ్ మేళా**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళకు విశేష స్పందన లభించింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గడ్డ వినోద్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.. ఈ జాబ్ మేళాకు జిల్లా నుంచి కాకుండా పొరుగు జిల్లాల నుండి నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నియోజకవర్గంలో ప్రతినెల మినీ జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు.

ఈ జాబ్ మేళా కు 8 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 1500 మందికి నియామక పత్రాలు అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు.

**పీటీసీ, మంచిర్యాల**

------------------------

**అమరవీరుల వారోత్సవాలు**

ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్కేపల్లి గ్రామంలో నివసిస్తున్న 30 కుటుంబాలకు ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**ఆసిఫాబాద్ - పిటిసి**

----------------------